ఎన్‌ఎస్‌డీసీ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డిస్ట్రిక్ మేనేజర్ ఆర్తిచౌహాన్ సూచించారు. ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్)లో కుట్టుశిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో సీనియర్ మేనేజర్ సింధు, బ్లాక్ మేనేజర్ మాలావత్ గణేశ్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:30	శని: 4:50

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.8 /29.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

నిబంధనల మేరకు అనుమతులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ లేఅవుట్, భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి జిల్లాస్థాయి లేఅవుట్ కమిటీతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాలు నిలిపివేయాలన్నారు. నూతన లేఅవుట్‌లలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలన్నారు. నిబంధనల మేరకు నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కమిటీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజినీరింగ్ అధికారులు శంకరయ్య, అశోక్‌కుమార్, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి రుణాలు

- డీఆర్డీవో విజయలక్ష్మి



డీఆర్డీవోకు రుణం చెల్లిస్తున్న మహిళలు

కుంటాల: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం లక్ష్యానికి మించి రుణాలు అందజేసినట్లు డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. కుంటాలలో స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినందుకు గురువారం అభినందించారు. జిల్లాలో 11,988 మహిళా సంఘాలకు సుమారు రూ.72 కోట్ల రుణాలను స్త్రీనిధి ద్వారా అందించినట్లు వెల్లడించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కుంటాలలోని బయోడిగ్రేడబుల్ న్యాప్కిన్ సెంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, సీసీ గంగా ప్రసాద్, ఏపీఎం అశోక్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, వీవోఏ దేవన్న, మట్ట గజ్జారాం తదితరులు ఉన్నారు.

ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ఆధారాలతోసహా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన అవినీతి అక్రమాలను అధికార కాంగ్రెస్ పార్టీ కాపాడుతోందని ఆరోపించారు. సోఫీనగర్‌లోని ప్రభుత్వ భూమిలో కట్టిన డీమార్ట్ విషయంలో అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెవెన్యూశాఖ మంత్రి ఆదేశాలు ఇచ్చినా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. డీమార్టు నిర్మించిన స్థలం ప్రభుత్వానిదని అధికారులు సర్వే చేసి ఇప్పుడు కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరిస్తున్నారన పేర్కొన్నారు. తాత్కాలికంగా డీమార్ట్‌ను ఓపెన్ చేయించినా స్థలం స్వాధీనం చేసుకునేలా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. సోఫీనగర్‌తోపాటు గాజులపేట, వెంకటాపూర్, అయ్యప్ప టెంపుల్ ప్రాంతాల్లో ప్రభుత్వ, దేవాదాయ భూముల విషయంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోతే, బీజేపీ నేతలంతా కాషాయ జెండాలు ధరించి గాజులపేటలోని శ్రీకృష్ణ దేవాలయం భూములు కాపాడుకునేందుకు ఆందోళనకు దిగుతామన్నారు.

సూర్యప్రతాపం





- గురువారం 40 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదు
- దస్తురాబాద్‌లో రాష్ట్రంలోనే అత్యధిక ఎండ..
- 43 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు
- మార్చిలోనే ఇంత ఎండతో జిల్లా వాసుల ఆందోళన

నిర్మల్: 'వామ్మో.. ఇప్పుడే ఎండ 40 డిగ్రీలపైన ఉంటే ముందుముందు ఇంకెంత ఉష్ణోగ్రతలు నమోదవుతాయో..!' అంటూ జిల్లావాసులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలోని దస్తురాబాద్ మండలంలో గురువారం అత్యధికంగా 43.1 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలంగాణ ప్రణాళికశాఖ గణాంకాలు పేర్కొన్నాయి. కొన్నిరోజులుగా ఎండలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ.. గురువారం ఎండ ప్రచండం కావడంతో దస్తురాబాద్ పగటిపూట మొత్తం నిర్మానుష్యంగా మారింది. జిల్లావ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. అన్నిమండలాల్లో సగటున 40 డిగ్రీలపైనే నమోదైంది.

మార్చిలోనే మంట..

ఎండాకాలం మొదట్లోనే భానుడు భగభగలాడుతున్నాడు. మార్చి మూడోవారం నుంచే సెగలు పెంచుతూ వచ్చిన సూర్యుడు నెలాఖరులో మరింత మండిపోతున్నాడు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఇక ముందు వేసవిలో ఎలా ఉంటుందో.. అని జిల్లా జనం భయపడుతున్నారు. రోజురోజుకూ తన ప్రతాపాన్ని పెంచుతున్న సూర్యున్ని చూస్తూ.. ఈసారి ఎండలు మండిపోయేలా ఉంటాయని చర్చించుకుంటున్నారు. వాతావరణ నివేదికల ప్రకారం మార్చి చివరివారంలోనే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు చేరుకోవడం కంగారుపెట్టిస్తున్నాయి.

రాష్ట్రంలోనే అత్యధికం..



నిర్మానుష్యంగా దస్తురాబాద్-మున్యాల్ దారి

ఈ సీజన్‌లో రాష్ట్రంలోనే తొలిసారి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. దస్తురాబాద్‌లో గురువారం ఏకంగా 43.1 సెల్సియస్ డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు ప్రణాళికశాఖ చెబుతోంది. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 40–41 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండగా, జిల్లాలో ఏకంగా 43 డిగ్రీలకు చేరడం గమనార్హం. సాయంత్రం ఆరింటి వరకూ దాదాపు 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కొనసాగింది. జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలూ 25 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటున్నాయి. రోజంతా అత్యధిక ఉష్ణోగ్రత ఉండటంతో దస్తురాబాద్ మండలంలో దాదాపు పగటిపూటంతా నిర్మానుష్యంగా మారింది. మండలకేంద్రంలో మధ్యాహ్నం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. ప్రధాన రహదారులు సైతం భగభగ ఎండకు బోసిపోయాయి.

ఉదయం 9 నుంచే..

ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. ఉదయం 9 గంటల నుంచే మండిపడుతున్నాడు. సాధారణంగా వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటాయి. మార్చిలో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యేది. కనిష్ట ఉష్ణోగ్రత 21 డిగ్రీలు ఉండాలి. కానీ జిల్లాలో వారం క్రితం 38 డిగ్రీలున్న గరిష్ట ఉష్ణోగ్రత గురువారం 40–43 డిగ్రీలుగా నమోదైంది. ఉష్ణోగ్రత 40 డిగ్రీలుగా నమోదైనా.. దాని ప్రభావం మాత్రం 42 డిగ్రీల వరకు చూపతోంది. ఇకనుంచి 40–41 డిగ్రీల ఉష్ణోగ్రత సాధారణం కానుంది. రోజంతా 40 డిగ్రీలపైన ఉండే ఉష్ణోగ్రతలు సాయంత్రానికి ఒక్కసారిగా 18–19 డిగ్రీలకు పడిపోతున్నాయి. పగటికి, సాయంత్రానికి పొంతనలేని ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మున్ముందు.. ఎలా ఉంటుందో..

ఈఏడాది ఎండలు మండిపోనున్నాయి. ప్రస్తుతం 40–42 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత ఏప్రిల్‌లో 42–43 డిగ్రీలుగా కొనసాగనున్నట్లు వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. సాధారణంగా జిల్లాలో మే నెలలో 42–45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. ఈసారి మాత్రం మార్చిలోనే 42 డిగ్రీలు దాటింది. ఇక ఏప్రిల్‌లోనే 45 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉంది. మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

తిరుగుబాటు!

- అన్ని పార్టీలు ఆదివాసీలవైపే మొగ్గు
- టికెట్ ఆశించి భంగపడ్డ బంజారాలు
- బీజేపీలో సిట్టింగ్ ఎంపీకి చుక్కెదురు
- రెబెల్‌గా బరిలో ఉంటానన్న 'సోయం'
- మరోవైపు 'బంజారా గర్జన'కు ప్రణాళిక
- ఆసక్తిగా మారిన పార్లమెంట్ ఎన్నికలు



సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. ఇక వివిధ పార్టీల్లోని అసంతృప్తుల లొల్లి మొదలైంది. పార్టీ టికెట్ దక్కకున్నా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేయాలని భంగపడ్డ నేతలు ప్రకటిస్తున్నారు. టికెట్ దక్కని సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు బీజేపీకి తిరుగుబాటు హెచ్చరికలు జారీ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. ప్రధాన పార్టీలన్నీ ఆదివాసీ నేతలకే టికెట్లు ఇవ్వగా బంజారా సమాజం గుర్రుగా ఉంది. ఇప్పటికే అన్ని పార్టీల్లోని బంజారా నేతలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చింది. 'బంజారా గర్జన' నిర్వహణకు ప్రణాళిక రచించింది. వివిధ పార్టీల్లో టికెట్లు ఆశించి భంగపడ్డ నేతల్లో ఒకరిని లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దించాలని యోచిస్తోంది.

పోటీకి సై అంటున్న 'సోయం'

బీజేపీ నుంచి మరోసారి టికెట్ ఆశించిన సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు చుక్కెదురైంది. దీంతో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. కమలం పార్టీ అభ్యర్థిగా గోడం నగేశ్ పేరు ప్రకటించిన బీజేపీ ఆయనకు ప్రచారంలో సహకరించాలని ఎంపీ బాపూరావును బుజ్జగిస్తోంది. అయినా ఆయన అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై గురువారం 'సాక్షి' బాపూరావును ఫోన్‌లో పలకరించగా తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఆదివాసీలు ఆరాధించే దువ్వల్ (పులి) గుర్తుపై పోటీ చేస్తానని చెప్పారు. దీంతో బీజేపీ తిరుగుబాటు అభ్యర్థిగా ఆయన బరిలో ఉండడం ఖాయంగా కనిపిస్తోంది.

ఏకతాటిపైకి బంజారాలు..

మరోవైపు ప్రధాన పార్టీల్లో టికెట్ ఆశించిన బంజారా నేతలకు ఆశాభంగం కలగడంతో అంతా ఏకతాటిపైకి రావాలని ఆ సమాజంలోని పెద్దలు పిలుపునిచ్చారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డారు. కాంగ్రెస్ నుంచి ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు శ్రావణ్‌నాయక్ తదితరులు టికెట్ ఆశించినా ఫలితం దక్కలేదు. అయితే అన్ని పార్టీలు ఆదివాసీలకే టికెట్ ఇవ్వాలని నిర్ణయించగా లంబాడా నేతల ఆశలు ఆవిరయ్యాయి. వీరంతా బంజారా సమాజం ఇచ్చిన పిలుపునకు స్పందించి బయటకు వస్తారా? లేదా? అనేది వేచిచూడాల్సిందే. కాగా, కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ఏదైన పదవి ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని ఆమె వర్గీయులు స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయంపై బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్‌ను 'సాక్షి' ఫోన్‌లో పలకరించినప్పుడు తనకు పోటీ చేయాలనే ఆసక్తి లేదని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో మిగతా బంజారా నేతల నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తిగా మారింది. వారంతా ఏకతాటిపైకి వచ్చి ఎవరినైన ఒకరిని బరిలోకి దింపుతారా? లేదా? అనేది 'బంజారా గర్జన'లో తేలనుంది.

సమన్వయంతో పనిచేయాలి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన వైద్య ఆరోగ్య సిబ్బంది, మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

- డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: వైద్య శాఖ సిబ్బంది తమకు కేటాయించిన విధులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలు సాధించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ సూచించారు. స్థానిక టీఎన్జీవో సంఘ భవనంలో రివైజ్డ్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, ఎస్ టీఐ, ఆర్టీఐ నమోదుపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు రాజశేఖర్, సతీశ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్షయ వ్యాధి నివారణ, నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం క్షయ నియంత్రణలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, జిల్లాలోని వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, జిల్లా డాటా మేనేజర్ నిత్యం, గంగాధర్, పర్యవేక్షక సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్‌ఎంలు, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటికీ.. రెంటికీ ఇబ్బందే..!

- భైంసా గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు కరువు
- వసతుల కల్పనకు రూ.17లక్షల నిధులు
- అసంపూర్తి పనులతో ఇబ్బంది పడుతున్న పాఠకులు



నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం



భైంసాలోని గ్రంథాలయం

భైంసాటౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సరైన వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం డీఎస్సీతోపాటు ఇతర పోటీ పరీక్షల సీజన్ కావడంతో గ్రంథాయానికి వచ్చే పాఠకులు పెరుగుతున్నారు. స్థానిక అటవీ కార్యాలయం పక్కన భవనంలో గ్రంథాలయం కొనసాగిస్తున్నారు. యువకులతోపాటు యువతులు సైతం గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. అయితే గ్రంథాలయంలో సరైన వసతులు లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో మహిళా పాఠకులు ఒంటికి, రెంటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. కొంతమంది మహిళా పాఠకులు పక్కనే ఉన్న అటవీ శాఖ కార్యాలయంలో మరుగుదొడ్లు వాడుకుంటున్నారు. సమస్యపై అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే గ్రంథాలయ శాఖ నిధుల నుంచి రూ.17 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు మంజూరు చేశారు. అయితే, చేపట్టిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపేశారు.

నిలిచిన పనులతో ఇబ్బంది..

భైంసా పట్టణంలో ఏకైక గ్రంథాలయం కావడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకే నిత్యం 50 మంది వరకు పాఠకులు వస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రంథాలయంలోనే గడుపుతున్నారు. దీంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక గంటల తరబడి బిగబట్టుకోవాల్సిన పరిస్థితి. గ్రంథాలయం ఆధునీకీకరణలో భాగంగా రూ.17లక్షల నిధులు మంజూరు కాగా, దాదాపు ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. గదుల్లో టైల్స్, ఎలక్ట్రికల్ రిపేర్స్, బోరు మోటార్ తదితర పనులు పూర్తయ్యాయి. మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించినా నిధులు రావడం లేదని మధ్యలోనే నిలిపేశారు. దీంతో అవి వినియోగించడానికి అవకాశం లేకుండా పోయింది. నిర్మాణం త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలనిపాఠకులు కోరుతున్నారు.

మూత్రశాలలు లేక ఇబ్బంది...



పోటీ పరీక్షలకు సన్నద్ధం కోసం ప్రతీరోజు గ్రంథాలయానికి వస్తుంటాను. ఉదయం వచ్చింది మొదలు సాయంత్రం వరకు ఇక్కడే ఉండాల్సి వస్తుంది. మధ్యలో మూత్ర విసర్జన కోసం ఇబ్బంది పడుతున్నాం. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా పూర్తి చేయలేదు. వెంటనే వాటిని వినియోగంలోకి తేవాలి. – రాథోడ్ లత, పాఠకురాలు, భైంసా

ఏకాగ్రత లోపిస్తోంది..



గ్రంథాలయంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక మహిళా పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వచ్చింది మొదలు సాయంత్రం వరకు చదువుకుంటాం. అయితే, మూత్రశాలలు లేకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితి. చదువుపై ఏకాగ్రత దెబ్బతింటోంది. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. – జ్యోత్స్న, పాఠకురాలు, భైంసా

త్వరగా పూర్తి చేస్తాం...

గ్రంథాలయం మరమ్మతులతోపాటు మరుగుదొడ్లు నిర్మాణం కోసం రూ.17 లక్షలు మంజూరయ్యాయి. గదుల్లో టైల్స్, విద్యుత్ రిపేర్లు దాదాపు పూర్తయ్యాయి. మరుగుదొడ్లు సైతం దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచిస్తాం. – భార్గవ్, ఏఈ

రేపు కాంగ్రెస్‌లోకి అల్లోల, గడ్డం..!?

- కేకేతో కలిసి వెళ్లే అవకాశం..!
- హైదరాబాద్‌లో చర్చించిన సీనియర్లు

నిర్మల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇద్దరు బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటికే తనవంతు ప్రయత్నాలు కొనసాగిస్తుండగా.. మరోవైపు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిద్దరూ హైదరాబాదులో బీఆర్‌ఎస్ సీనియర్ నేత కె.కేశవరావును గురువారం కలిశారు.

కేకేను కలిసిన సీనియర్లు..

భారత రాష్ట్ర సమితిలో నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమైన కేశవరావు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కలిశారు. ఈ సమావేశం నుంచి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో కేకేను ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, గడ్డం అరవింద్‌రెడ్డి కలిశారు. ఈ నేతలిద్దరూ కొన్ని రోజులుగా హస్తం పార్టీలో చేరేందుకు ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 30న కేశవరావు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో ఆయన వెంట సీనియర్ నేతలు ఇద్దరూ హస్తం కండువా కప్పుకుంటారని ప్రచారం జరుగుతోంది. సీనియర్ నేత కేశవరావుకు నిర్మల్ జిల్లాతో గత అనుబంధం ఉంది. ఈ క్రమంలో కేకేతో కలిసి సీనియర్లు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

నిర్ణయం తీసుకోలేదు : 'అల్లోల'

కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారంటూ తనపై కొంతకాలంగా నడుస్తున్న ప్రచారాన్ని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఖండించారు. తాను కాంగ్రెస్‌లో చేరే విషయం ఇంకా ఫైనల్ కాలేదని, పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోలేదని 'సాక్షి'కి తెలిపారు. కేసీఆర్‌ను కలిసి వచ్చినందునే కేకేతో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో వరి కొనుగోలుపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణలో పాల్గొన్నారు. జిల్లాలో వరి పంట కోతకు వచ్చినందున కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన వరిని సరైన తేమ శాతం వచ్చిన తర్వాతనే లోడింగ్ చేయాలని సూచించారు. వేసవి తాపం పెరిగిపోతున్నందున కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. లారీ అసోసియేషన్ వారు వరి కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలన్నారు. లారీ లోడ్ అయిన తర్వాత అన్‌లోడింగ్ అయ్యే వరకు దానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాల ఎంట్రీ, జియో టాగింగ్ తదితర అంశాలపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కొనుగోలుకు సంబంధించి ఎక్విప్మెంట్ కొరత లేకుండా చూడాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ, డీసీఎస్‌వో నందిని, డీసీవో నర్సయ్య, ఏడీ మార్కెటింగ్ అశ్ఫక్, డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చేతి పంపు వద్ద నీళ్లు పట్టుకుంటున్న ఆదివాసీ మహిళలు

వస్‌పల్లి కొత్తగూడెంలో బోర్లు

- 'సాక్షి' కథనానికి స్పందన

పెంబి: మండలంలోని ధూందరి గ్రామ పంచాయతీ పరిధిలో వస్‌పల్లి కొత్తగూడెం గ్రామానికి తాగునీటి ఇబ్బందిపై ఈనెల 18న 'గొంతెండుతోంది' శీర్షికన 'సాక్షి' మెయిన్ పేజీలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ట్యాంకర్‌తో ఈనెల 22న తాగు నీటిని సరఫర చేశారు. తాజాగా వస్‌పల్లి కొత్తగూడెం గిరిజన గ్రామంలో రెండు బోర్లు వేశారు. ఒకదానికి చేతి పంపు, మరొకదానికి మోటార్ బిగించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో వస్‌పల్లి కొత్తగూడెం గిరిజన వాసుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



బోరు మోటార్ వద్ద ఆదివాసీ గిరిజనులు

క్లుప్తంగా

మట్కా స్థావరంపై దాడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

తాంసి: మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న భీంపూర్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న మట్కా స్థావరంపై గురువారం భీంపూర్ పోలీసులు దాడి చేశారు. మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రదీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పక్కా సమాచారం మేరకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా మహారాష్ట్రకు చెందిన భగత్ జైపాల్, కరాడే సౌరభ్‌తో పాటు, బెల్సరీరాంపూర్ గ్రామానికి చెందిన సిడాం జంగులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మట్కా చిట్టీలతో పాటు రూ.3240 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ఇంట్లో సిలిండర్ లీకై ఇల్లు దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. అరిగేల శేఖర్ ఇంట్లో సౌజన్య తన ఇద్దరు పిల్లలతో కలిసి కిరాయికి నివాసం ఉంటోంది. ఆమె భర్త హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సౌజన్య గురువారం సాయంత్రం వంట గదిలో పనిచేస్తుండగా సిలిండర్ కింద పడి లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే సౌజన్య తన ఇద్దరు పిల్లల్ని తీసుకొని బయటకు వచ్చింది. చుట్టుపక్కల వారు గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపుచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని విలువైన సామగ్రి కాలిపోవడంతో సుమారుగా రూ.70వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితురాలు పేర్కొంది.

తప్పిన ప్రమాదం



సంఘటన స్థలంలో క్షతగాత్రుడు మహేశ్

నేరడిగొండ: మండలంలోని గోండులఖంపూర్ జాతీయ రహదారి సమీపంలో కారు అదుపు తప్పిన ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గురువారం ఇచ్చోడ నుంచి మెట్‌పల్లికి కారులో మహేష్ వెళ్తుండగా గోండులఖంపూర్ జాతీయ రహదారి సమీపంలో ఒక్కసారిగా కారు అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే గల పోల్స్‌ను ఢీకొట్టింది. దీంతో మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆయనను ఎస్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏజెన్సీలో గవద బిళ్లల విజృంభన



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాంబాబు, వైద్య సిబ్బంది

- వ్యాధి బారిన చిన్నారులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో చిన్నారులు ఎన్నడూ లేనివిధంగా గవద బిళ్లల వ్యాధితో బాధపడుతున్నారు. 20రోజుల నుంచి చిన్నారుల్లో ఈ వ్యాధి లక్షణాలు అధికంగా బయటపడుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ తదితర మండలాల్లోని చిన్న పిల్లలు ఈ గవద బిళ్లల వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఎక్కువ మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు అనారోగ్య సమస్యలతో వచ్చే చిన్నపిల్లల్లో అనేక మంది ఈ వ్యాధితో వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. వందలో ఐదు నుంచి పది మంది ఈ వ్యాధి లక్షణాలతోనే వస్తున్నట్లు తెలుస్తోంది. ఇంట్లో ఈ వ్యాధి ఒకరికి సోకినా... వెంటనే ఇతర పిల్లలకు సైతం అంటుకుంటుందని బాధితుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఐదేళ్ల నుంచి 15ఏళ్లలోపు పిల్లలకు గవద బిళ్లల వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సంబంధిత వైరస్ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని, పిల్లలకు సాధన టీకాలు ఇచ్చే షెడ్యూల్‌లో ఎంఎంఆర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేస్తారు. వ్యాక్సిన్ తీసుకున్న వారికి వ్యాధి సోకిన ప్రాణహాని తలెత్తకుండా ఉపయోగపడనుందని, వ్యాధి ప్రభావం కనీసం ఐదు నుంచి ఏడు రోజుల వరకు ఉంటుందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

సమస్య తీవ్రత..

గవద బిళ్లల వ్యాధి సాధారణమైన వైరస్. ముఖానికి ఇరువైపులా చెవుల కింద వాపు కలిగించి వేధిస్తుంది. పారామిక్సో వైరస్ కారణంగా గడ్డలు ఏర్పడతాయి. ఈ అంటువ్యాధి సోకిన బాధితులు తుమ్మినా, దగ్గినా ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందుతోంది. గొంతు, చెవులకు పరీక్ష, రక్త, ముఖ జీవకణ (నోటి స్వాబ్) మూత్ర పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు. సమస్యను ఎదుర్కొంటున్న బాధితుల్లో నిరసం, జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పి, గవదవాపు, నోరు ఎండడం, ఆకలి లేకపోవడం, గందరగోళం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకిన 14 నుంచి 25 రోజుల తర్వాత ఈ లక్షణాలు బయటపడతాయి. ఈ క్రమంలో వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి



గవద బిళ్లల వాపుతో ఇటీవల పిల్లలు ఎక్కువ మంది ఆసుపత్రికి వస్తున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సరైన సమయంలో సాధారణ చికిత్సతోనే ఇది నయమవుతుంది. వ్యాధి లక్షణాలకు గుర్తించి సకాలంలో వైద్యం అందించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మెదడుకు సోకి కోమలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి అంటుకుంటుంది. చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి.

– డాక్టర్ రాంబాబు, వైద్యాధికారి, పీహెచ్‌సీ నార్నూర్

జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్





జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

నేరడిగొండ: జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఉండొచ్చని ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ చెబుతున్నారు. ఈ ఏడాది ఎండలు మరింత ఎక్కువగా నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వడదెబ్బ లక్షణాలు, నివారణ మార్గాల విషయమై 'సాక్షి'తో పలు విషయాలు చెప్పారు. ఎండలో తిరగడం, తీవ్రమైన వడగాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని, వాటి నుంచి ఎలా కాపాడుకోవాలో ఆయన మాటల్లోనే..

సాక్షి: వడదెబ్బ లక్షణాలు..?

డైరెక్టర్: మానవ శరీరంలో తీవ్రమైన తలనొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక తడారిపోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారకస్థితికి చేరుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సాక్షి: వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన చికిత్స ..?

డైరెక్టర్: వడదెబ్బకు గురైన వ్యక్తిని సాధ్యమైనంత త్వరగా నీడలోకి తీసుకెళ్లాలి. చల్లని నీటితో ముంచిన గుడ్డతో శరీరాన్ని మొత్తం తుడవాలి. వడదెబ్బ తగిలిన వారికి ఉప్పు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్, ఇతర లక్షణాలు (ఓఆర్ఎస్) కలిపిన నీటిని తాగించాలి. ప్రథమ చికిత్స చేసి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సమీపంలోని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. ఏరియా ఆస్పత్రులతో పాటు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి కూడా తరలించవచ్చు.

సాక్షి: వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి.?

డైరెక్టర్: మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండలో తిరగకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్లేటప్పుడు గొడుగు, టోపి, తలపాగ లాంటివి ధరించాలి. వేసవిలో ఎక్కువ శాతం చల్లని, నూలు వస్త్రాలు ధరించాలి. ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడటం చేయరాదు. వివిధ రకాల పండ్లతో పాటు నీరు, ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. మత్తు పానీయాలకు దూరం ఉండాలి. బయట కలుషిత ఆహారం తినవద్దు. చిన్నారులు, వృద్ధులు. గర్భిణులు మరింత శ్రద్ధ తీసుకోవాలి.

నిజాయతీ చాటిన మున్సిపల్ సిబ్బంది



బంగారు గొలుసునను అందిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: చెత్తలో వచ్చినా రెండున్నర తులాల బంగారు గొలుసును బాధిత మహిళకు అప్పగించి మున్సిపాలిటీ డ్రైవర్, లేబర్ గురువారం నిజాయితీని చాటుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణ్‌వాడకు చెందిన ఓ మహిళ తన మెడలోని రెండున్న తులాల బంగారు గొలుసు అనుకోకుండా చెత్త బుట్టలో పడింది. గురువారం గల్లీలో ఇంటింటికి చెత్త సేకరణ కోసం వచ్చినా స్వచ్ఛ భారత్ వాహనంలో చెత్తతో పాటు బంగారు గొలుసును ఆ వాహనంలో వేసేశారు. బంగారు గొలుసు కనిపించకపోవడంతో చెత్త సేకరణ కోసం వచ్చినా మున్సిపాలిటీ వాహనం డ్రైవర్, లేబర్ దృష్టికి తీసుకెళ్లింది. అప్పటికే మొదటి ట్రిపుల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో అన్‌లోడ్ చేసేశారు. అనంతరం మున్సిపాలిటీ డ్రైవర్ శ్యామ్, లేబర్ రమేష్‌లు డంపింగ్ యార్డులో అన్‌లోడ్ చేసిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. బంగారు గొలుసు లభించగా మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేష్, డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు జనార్ధన్, సభ్యులు రవీందర్, అడ్డూరి ఆశన్నలతో కలిసి బాధిత మహిళకు బంగారు గొలుసును అందజేశారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో



హాజరైన గురుకుల ప్రిన్సిపాళ్లు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులకు సూచించారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిగిరిజన గురుకుల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు పౌష్టకాహారంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటూ చదువుపై దృష్టి సారిస్తారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై శ్రద్ధ వహించాలని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవిలో నీటి సౌకర్యం, వసతుల కల్పనపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ప్రాంతీయ సమన్వయ కర్త గంగాధర్, వివిధ గిరిజన గురుకుల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పీవీటీజీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి..

వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న పీఈటీజీలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో సెర్ప్, జిల్లా, మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పేపర్ ప్లేట్ తయారీ, ఇప్పపువ్వు ప్రాసెసింగ్, పేపర్ బ్యాగ్ తయారీ లాంటి మరెన్నో యూనిట్లను స్థాపించి పీవీటీజీల జీవనోపాధికి సహకరించి తగిన శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీడీ దిలీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

చెంగిచర్ల బాధితులకు అండగా ఉంటాం

- బండి సంజయ్‌పై కేసు సరికాదు
- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: చెంగిచర్ల ఘటనలో బాధితులకు అండగా ఉంటామని, ఈ ఘటనలో బాధితులను పరామర్శించడానికి వెళ్లిన తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌పై కేసు నమోదు చేయడం సరికాదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హోలీ పండుగ రోజు ఓ వర్గం చేసిన దాడిలో గాయపడిన ఆదివాసీ మహిళలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లినవారిపై కేసులు పెట్టడం కాదని, ఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ,ఎస్టీ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. నిర్మల్‌లో ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టిన డీమార్ట్‌పై, మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆయన అనుచరులు ఆక్రమించిన భూములపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏలేటి డిమాండ్ చేశారు.

దాడికి యత్నించిన పలువురి రిమాండ్

ఎదులాపురం: కత్తితో దాడికి యత్నించిన పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ ఎస్సై సత్యనారాయణ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డుకు చెందిన ఆత్రం రాహుల్ బుధవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో బస్టాండ్ ముందు వాహనాన్ని నిలిపి ఉండగా అటుగా బైక్‌పై వచ్చిన పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన కుంచాల సాయికుమార్, అతడి స్నేహితులు వారి వాహనాన్ని తొలగించాలన్నారు. ఈ క్రమంలో వారికి రాహుల్, సాయికుమార్, అతడి స్నేహితులకు మధ్య మాట మాట పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో సాయికుమార్ తన వద్దనున్న కత్తిని బయటకు తీసి దాడిచేసేందుకు యత్నించాడు. దీంతో రాహుల్ వారి నుంచి తప్పించుకుని వన్‌టౌన్‌లో కేసు నమోదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దాడికి యత్నించిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతితో స్నేహం-పక్షులకు సహాయం

- ఆదర్శంగా నిలుస్తున్న పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పక్షుల సంరక్షణకు చర్యలు



పక్షుల కోసం నీటితొట్టెలు, బర్డ్‌ఫీడర్‌లను ఏర్పాటు చేయిస్తున్న వెంకటేష్

నిర్మల్‌ఖిల్లా: వేసవి తీవ్రత పెరిగిపోతోంది. మనుషులే దాహార్తి తట్టుకోలేక చలివేంద్రాలకు, శీతల పానీయాల తాగడానికి పరుగులు పెట్టే కాలమిది. ఇలాంటి సమయంలో ఎండల తీవ్రతకు మరి పక్షుల పరిస్థితి ఎలా ఉంటుంది..? ఇదే అంశాన్ని ఆలోచించిన జక్కుల వెంకటేష్ అనే పక్షి ప్రేమికుడు పక్షుల కోసం బర్డ్ ఫీడర్, వాటర్ ఫీడర్స్ వంటివి ఏర్పాటు చేస్తూ పలువురికి స్ఫూర్తిని కలిగిస్తున్నాడు. పక్షుల సంరక్షణ ధ్యేయంగా 'ప్రకృతితో స్నేహం-పక్షులకు సహాయం' అనే కార్యక్రమాన్ని చేపడుతూ విద్యార్థులని ప్రజల్ని చైతన్యవంతం చేస్తున్నాడు.

సంరక్షణ కోసం..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి జక్కుల వెంకటేష్.. పక్షుల సంరక్షణ కోసం చేసే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. పక్షుల ప్రేమికుడిగా తను పడే తపన చూస్తుంటే అబ్బుర మనిపిస్తుంది. వేసవి వచ్చిందంటే తన ద్విచక్ర వాహనంపై ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శిస్తూ పక్షుల సంరక్షణ కోసం తన సందేశాన్ని వినిపిస్తున్నాడు. పక్షులు దాహార్తిని తీర్చాలని వాటికోసం తన సొంతంగా ఖర్చుపెట్టి బర్డ్ ఫీడర్లను పంపిణీ చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం ఓ పక్షి దాహం కోసం అలమటించి తన కళ్లముందే మరణించిన విషయం తనను కలిసిందని ఇక అప్పటి నుంచి పక్షుల కోసం నీటి తొట్టెలు ఉచితంగా పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాడు. ఇదే అంశంపై గతవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పక్షులు అంతరించిపోకుండా వాటిని సంరక్షించుకునే విధానాలను కూడా తెలుపుతున్నాడు.

శుభకార్యాలకు కానుకగా బర్డ్ ఫీడర్లు అందివ్వాలి..

పుట్టినరోజు, వివాహ దినోత్సవాలు వంటి శుభకార్యాలకు ఒక మొక్కను గానీ పక్షుల కోసం నీటి తొట్టె బర్డ్ ఫీడర్ కృత్రిమ పక్షి గూడు వంటి వాటిని కానుకగా ఇవ్వాలి. ఈ సంప్రదాయం కొనసాగడం వల్ల ప్రకృతికి మేలుచేసిన వారమవుతాం. విద్యాసంస్థల ఆవరణలో కూడా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి. ప్రకృతి మానవుడికి ఎన్నో విషయాలను బోధిస్తూ మనుగడకు తోడ్పడుతుంది మన పూర్వీకులు ప్రకతి రక్షణ గురించి అనేక రకాలైన వారసత్వ సంపదను మనకు అందించారు. దాన్ని మనం కాపాడుకుంటూ రాబోయే భావితరాలకు అందించాలి.

– జక్కుల వెంకటేశ్, పక్షి ప్రేమికుడు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుల మృతి

- కుమురంభీం జిల్లా లింగాపూర్‌లో విషాదం



పవన్ (ఫైల్)



సాయిచరణ్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

ఉట్నూర్‌రూరల్/లింగాపూర్: ఉట్నూర్ మండలం పెర్కగూడ సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో కుమురంభీం జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రులు ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి జాదవ్ సాయిచరణ్(19), కొదురుపాక పవన్ (18) మృతి చెందారు. సాయికుమార్ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

లింగాపూర్‌లో విషాదఛాయలు...

శుభకార్యానికి వచ్చి తిరిగి లింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయిచరణ్, కుదురుపాక పవన్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. జాదవ్ రమేశ్-విజయ దంపతుల ఒకగానొక్క కుమారుడు జాదవ్ సాయిచరణ్ ఢిల్లీలో జేఈఈ కోచింగ్ తీసుకుని పరీక్షలో పాసై వారం కిందటే ఇంటికి వచ్చాడు. రాయమల్లు-లావణ్య దంపతుల రెండో కుమారుడు కొదురుపాక పవన్ కుమార్ ఇంటర్మీడియట్ చదివి ఇంటివద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో శుభకార్యానికి వచ్చి వెళ్తూ ఈ ప్రమాదానికి గురై మృతి చెందడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

బేల: మండలంలోని తోయగూడ రెవెన్యూ గ్రామంలో గురువారం ట్రాక్టర్ బోల్తాపడి బావునే రాకేష్ (32) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తోయగూడ గ్రామానికి చెందిన గొమాసే ప్రమోద్ వద్ద జైనథ్ మండలంలోని మారుగూడ గ్రామానికి చెందిన బావునే రాకేష్ కూలీగా పనిచేస్తున్నాడు. ప్రమోద్ ఇంట్లో మరో రెండు రోజుల్లో శుభకార్యం ఉండగా తన ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీళ్లు తీసుకురావడానికి ఇరువురు వెళ్లారు. ట్యాంకర్‌తో ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామంలోని అంతర్గత రోడ్డు సరిగా లేకపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో ట్యాంకర్‌పై ఉన్న రాకేష్ కిందపడగా తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పూజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి

తానూరు: దాడిలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని కుప్టి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం... కుప్టి గ్రామానికి చెందిన వాగ్మారే నితిన్ (25) అతడి చిన్నాన్న కూతురు భర్త నాగేశ్ కుటుంబాల మధ్య గతంలో గొడవలయ్యాయి. అయితే ఈ నెల 25వ తేదీన హోలీ పండుగ కావడంతో నితిన్ అతడి సోదరుడు భయ్యాసాబ్‌తో కలిసి చిన్నాన్న కూతురు పిల్లలకు కుడకలపెర్ల దండలను ఇవ్వడానికి వెళ్లారు. దీంతో మా ఇంటికి ఎందుకు వచ్చావని నాగేశ్‌తో పాటు అతడి సోదరులు విలాస్, కైలాస్‌లు నితిన్, అతడి సోదరుడిపై దాడికి దిగారు. ఈ దాడిలో నితిన్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబీకులు అతడిని భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన దేవర్తి శివయ్య (48) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శివయ్య కొంతకాలంగా మూత్రపిండాలు, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. మనస్తాపానికి గురైన ఆయన తన వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ వైపు వెళ్లిన గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌లో బుధవారం అర్ధరాత్రి వీధికుక్కలు రెండు గొర్రెలపై దాడి చేసి చంపివేశాయి. పట్టణంలోని శివాజీ నగర్ కాలనీకి చెందిన రైతు ఆరె గంగారాం నివాసంలో ఇంటి ముందు కట్టేసిన రెండు గొర్రెలపై కుక్కలు దాడిచేశాయి. సుమారు రూ.15వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.